PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 331 పేజీలు - 08 ఆదివారం 25 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో
# కీలక చర్చలు!

**152 మీటర్ల ఎత్తుకు సమ్మతి కోరనున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**150 మీటర్లకైనా అంగీకారం సాధించేలా ప్రయత్నాలు.. ఏటా**

**రూ.383.50 కోట్ల విద్యుత్ ఖర్చు ఆదా లక్ష్యం**



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 24:** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ కానున్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు సహకరించాలని కోరనున్నారు. మహారాష్ట్ర

మిగతా2లో...



## రక్షణ రంగంలో తెలంగాణను అగ్రగామిగా
# తీర్చిదిద్దాలి!

**త్వరలో రక్షణ, ఏరోస్పేస్ విధానం2.0:ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి**

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 24:** రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా తెలంగాణను దేశంలోనే అతిపెద్ద రక్షణ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడి ప్రణాళికలను రెట్టింపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారం అందించడంతోపాటు, పెట్టుబడిదారులు ఆశిస్తున్న లాభాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని

మిగతా2లో...



## కాంగ్రెస్ పాలనలో అన్నదాత బతుకే
# ప్రశ్నార్థకం!

**- రైతుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారు.. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం: మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు**

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 24:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు విమర్శించారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన రైతులకు అవమానాలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ఓ తహసీల్దార్ రైతుతో అవమానకరంగా

మిగతా2లో...

# ఇరాన్‌పై మరోసారి దాడులు చేస్తాం!

**- ఒప్పందానికి రాకుంటే సైనిక చర్యలు తప్పవు.. ట్రంప్ హెచ్చరిక**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ/వాషింగ్టన్, అక్టోబర్ 24:** ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే మరోసారి సైనిక దాడులు చేపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అమెరికాతో చర్చలకు ముందుకు

మిగతా2లో...

# సెమీ కండక్టర్, కృత్రిమ మేధ రంగాలకు ఊపు!

**ఏపీ అభివృద్ధికి కేంద్రం సహకారం.. రూ.10 వేల కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులపై చర్చలు**



## ఆంధ్రప్రదేశ్ తీరానికి
# తుఫాను ముప్పు!

**- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం.. భారీ వర్షాల హెచ్చరిక**



**తొలి అక్షరం/విశాఖపట్నం, అక్టోబర్ 24:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 28న విశాఖపట్నంబాపట్ల మధ్య తీరాన్ని దాటే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుఫాను తీరం దాటే సమయంలో గంటకు

మిగతా2లో...

## తెలుగోళ్ల తడాఖా.. కివీస్‌పై
# భారత్ ఘన విజయం!

**తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి ధనాధన్ ఆట.. రెండో టీ20లో 4 వికెట్లతో గెలుపు**




**తొలి అక్షరం/క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:** న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. తిలక్ వర్మ (51 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌లతో రాణించడంతో భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 20తో ఆధిక్యంలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (70),

మిగతా2లో...

## షర్మిలకు జగన్ లేఖ..

**బెంగళూరు నివాసంలో పెళ్లికి అభ్యంతరం!**

**● భద్రత, వ్యక్తిగత గోప్యతకు ఇబ్బందులు కలుగుతాయని వెల్లడి**



**తొలి అక్షరం/అమరావతి, అక్టోబర్ 24:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సోదరి వైఎస్ షర్మిలకు లేఖ రాశారు. షర్మిల కుమార్తె అంజలిరెడ్డి వివాహాన్ని బెంగళూరులోని తన నివాస ప్రాంగణంలో నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

మిగతా2లో...

## రాష్ట్రాన్ని రాక్షసులకు
# వదిలేయాలా?

**స్థానిక ఎన్నికల్లో హింస, విధ్వంసాన్ని సహించేది లేదు: సీఎం చంద్రబాబు**

**జగన్‌పై తీవ్ర విమర్శలు.. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు**


2లో



## నవంబర్ 10 తర్వాతే ర్యాలీ
# నిర్వహించండి!

**రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి**

**పండుగల వేళ వ్యాపారాలకు నష్టం కలగకుండా చూడాలని అభ్యర్థన**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 24:** ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించ తలపెట్టిన ఇండియా కూటమి ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీ వ్యాపారుల సంఘం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసింది.

మిగతా2లో...

# రాష్ట్రాన్ని రాక్షసులకు వదిలేయాలా?

**తొలి అక్షరం/అమరావతి, అక్టోబర్ 24:** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక ఎన్నికల్లో హింస, విధ్వంసాలకు పాల్పడుతూ, మరోవైపు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని జగన్‌పై ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. అయితే, హింసకు ప్రతిహింస తమ కూటమి విధానం కాదని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో పుంగనూరు, రాయచోటి, కనిగిరి, దర్శి, తంబళ్లపల్లె, కడప, తిరుపతి తదితర ప్రాంతాల్లో జరిగిన ఘటనలను చంద్రబాబు ప్రస్తావించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నాయని, నామినేషన్ల ప్రక్రియకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలు, చట్ట నిబంధనలు పాటించాలని సూచించారు.

**కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం**

టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజల్లో గుర్తింపు ఉన్నవారికి, పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. టికెట్లు దక్కని ఆశావహులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూడాలని, రెబల్ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పేర్కొన్నారు.

**జగన్ తీరుపై విమర్శలు** జగన్ రాజకీయ విధానాలు, న్యాయస్థానాల్లో దాఖలు చేస్తున్న పిటిషన్లపై చంద్రబాబు విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలపై కూడా వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియకు అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని అన్నారు.స్థానిక ఎన్నికల్లో కూటమి నాయకులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల మద్దతు పొందా లని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించేందుకు రాజకీయ ఘర్షణలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# సెమీ కండక్టర్, కృత్రిమ మేధ రంగాలకు ఊపు!

**తొలి అక్షరం/అమరావతి, అక్టోబర్ 24:** ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ రూపకల్పన, కృత్రిమ మేధ రంగాల అభివృద్ధికి సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో సాంకేతిక రంగాలను విస్తరించడంతోపాటు రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన సెమీకండక్టర్ ప్రాజెక్టులకు పరిశోధన, నైపుణ్య శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనలో సహకారం అందించే అంశాలు చర్చకు వచ్చాయి. **రైల్వే ప్రాజెక్టులకు ప్రాధాన్యం** ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది ఓడరేవులకు అవసరమైన రైల్వే అనుసంధానం కల్పించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపినట్లు కథనం పేర్కొంది. విజయవాడ బైపాస్ నిర్మాణానికి రూ.3,197 కోట్లు, కొవ్వూరుభద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు రూ.2,860 కోట్లు, ఒంగోలుదొనకొండ రైల్వే ప్రాజెక్టుకు రూ.1,800 కోట్లు, అనకాపల్లికొత్తవలస బైపాస్‌కు రూ.2,190 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చంద్రబాబు వివరించారు.విజయవాడ బైపాస్‌లో భాగంగా కృష్ణా నదిపై రెండు కొత్త వంతెనలు నిర్మించాలని కోరారు. విజయవాడఇటార్సీ, ఖరగ్‌పూర్‌విజయవాడ రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచేందుకు నాలుగు లైన్ల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని సూచించారు. **అమరావతి విశాఖ మధ్య వేగవంతమైన రైలు మార్గం** అమరావతివిశాఖపట్నం మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. విశాఖపట్నం నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు నిద్రించే సౌకర్యంతో కూడిన వందేభారత్ రైలును నడపాలని ప్రతిపాదించారు. విశాఖపట్నంతిరుపతి మధ్య పగటిపూట ప్రయాణానికి అనువైన మరో రైలును ప్రవేశపెట్టే ప్రతిపాదనకూ కేంద్ర మంత్రి సానుకూలత తెలిపినట్లు సమాచారం. కొత్తగా నిర్మించిన కనిగిరివిజయవాడ మార్గంలో ప్రయాణికుల రైళ్ల సేవలను ప్రారంభించాలని చంద్రబాబు కోరారు.మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోనూ చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు కథనం వెల్లడించింది. కేంద్ర సహకారంతో సాంకేతిక రంగాలు, రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో కీలక చర్చలు!

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాలు వ్యక్తం చేస్తే, కనీసం 150 మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు అంగీకారం సాధించే దిశగా చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. **ఏటా రూ.383.50 కోట్ల విద్యుత్ ఖర్చు ఆదా**తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే సుమారు 76.65 కిలోమీటర్ల మేర నీటిని గురుత్వాకర్షణ శక్తితో తరలించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విధానం ద్వారా 80 టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉంటుందని, ఏటా సుమారు రూ.383.50 కోట్ల విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందని ప్రభుత్వం లెక్కలు వేసింది. అదనంగా 20.90 కిలోమీటర్ల సొరంగం నిర్మించి, మరో 8.25 కిలోమీటర్ల మేర గురుత్వాకర్షణతో నీటిని సుందిళ్ల బ్యారేజీకి చేర్చే ప్రణాళికను మహారాష్ట్ర ప్రభుత్వానికి వివరించనున్నారు. **ముంపు సమస్యపై స్పష్టత ఇచ్చే ప్రయత్నం**బ్యారేజీ నిర్మాణం వల్ల గ్రామాలు ముంపునకు గురికాకుండా ప్రణాళిక రూపొందించి నట్లు తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే నదీ గర్భంలో సుమారు 1,706 హెక్టార్లు, 152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే 2,156 హెక్టార్ల మేర ముంపు ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. చాప్రాల పర్యావరణ సున్నిత ప్రాంతంపై ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. ఈ వివరాలతో పాటు నీటి లభ్యత, సాంకేతిక నివేదికలను మహారాష్ట్ర ముఖ్యమంత్రికి సమర్పించనున్నారు. **ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు**తుమ్మిడిహెట్టి బ్యారేజీ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన, అటవీ ప్రాంతాల్లో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. గతంలో 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పటికీ, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తుకు అంగీకారం పొందేందుకు ప్రయత్నిస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించి గతంలో జరిగిన అంతర్రాష్ట్ర చర్చలు, కేంద్ర జల సంఘం సూచనలు, నీటి తరలింపు సాధ్యాసాధ్యాలను కూడా మహారాష్ట్ర ప్రభుత్వానికి వివరించనున్నారు. ఈ చర్చల్లో ఏకాభిప్రాయం కుదిరితే ప్రాజెక్టు తదుపరి పనులు, మార్గ రూపకల్పన, భూసేకరణపై ముందడుగు పడే అవకాశం ఉంది.

# రక్షణ రంగంలో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దాలి!

(మొదటి పేజీ తరువాయి)

తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో నిర్వహించిన 'రక్ష ఎక్స్‌పో2026' ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రక్షణ ఉత్పత్తుల తయారీ, ఆయుధ ఎగుమతులు, అంతరిక్ష పరిశోధనలు, విమానయాన రంగాల్లో దేశం మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం యుద్ధాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకునే స్థాయి నుంచి, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదగాలని ఆకాంక్షించారు. ఆయుధ సంపత్తి యుద్ధాల కోసం మాత్రమే కాకుండా, శత్రువులు దాడులకు దిగకుండా నిరోధించి దేశంలో శాంతిని కాపాడేందుకు కూడా అవసరమని పేర్కొన్నారు. **పెట్టుబడులకు ప్రభుత్వ పూర్తి సహకారం** తెలంగాణలో పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రక్షణ రంగంతోపాటు అంతరిక్ష పరిశోధనలు, విమానయాన సాంకేతికత, సైబర్ భద్రత, కృత్రిమ మేధ, డ్రోన్ సాంకేతికత వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లోనూ పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ తనవంతు సహకారం అందిస్తోందని వివరించారు. త్వరలో రక్షణ రంగ విధానం2.0, ఏరోస్పేస్ విధానాన్ని ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ, దేశీయ, అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించడమే లక్ష్యమన్నారు. **2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులు** తెలంగాణను 2034 నాటికి ఒక లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో ప్రస్తుతం తెలంగాణ వాటా సుమారు ఐదు శాతంగా ఉందని, 2047 నాటికి దాన్ని పది శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యాల సాధనలో రక్షణ ఉత్పత్తుల తయారీ, విమానయాన, అంతరిక్ష రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. **హైదరాబాద్ కేంద్రంగా రక్షణ పరిశ్రమల విస్తరణ** రక్షణ, విమానయాన రంగాలకు హైదరాబాద్ వ్యూహాత్మక కేంద్రంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రక్షణ పరిశోధన, క్షిపణుల తయారీ, విమానాల విడిభాగాలు, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. డీఆర్‌డీవో, హెచ్‌ఏఎల్, బీడీఎల్, మిధాని, టాటా, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ప్రముఖ సంస్థలు ఈ రంగాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు.రాష్ట్రంలో నైపుణ్యమున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన మానవ వనరులను సిద్ధం చేయడం ద్వారా అధునాతన తయారీ రంగాలకు బలమైన పునాది వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. **ఎగుమతుల్లోనూ వృద్ధి** రాష్ట్రంలో రక్షణ, విమానయాన ఉత్పత్తుల ఎగుమతులు 202324లో రూ.15,900 కోట్లుగా ఉండగా, 202526లో రూ.32,850 కోట్లకు చేరినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. రక్షణ, విమానయాన పరిశ్ర మలకు తెలంగాణ అనుకూల ప్రాంతమని పేర్కొన్నారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నైపుణ్య శిక్షణ, మౌలిక సదు పాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని వివరించారు.

## తెలుగోళ్ల తడాఖా.. కివీస్‌పై భారత్ ఘన విజయం!

(మొదటి పేజీ తరువాయి)

బెవాన్ జాకబ్స్ (58) అర్ధశతకాలతో రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీశాడు.181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఒక దశలో 112 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ అద్భుతంగా ఆడారు. ఏడో వికెట్‌కు అజేయంగా 30 బంతుల్లో 69 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించారు. తిలక్ వర్మ 51 పరుగులతో అజేయంగా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.తెలుగు ఆటగాళ్ల సమన్వయం, దూకుడైన బ్యాటింగ్ భారత విజయానికి కీలకంగా నిలిచాయి. మూడో టీ20 మంగళవారం వెల్లింగ్టన్‌లో జరగనుంది.

## ఆంధ్రప్రదేశ్ తీరానికి తుఫాను ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో, అప్పుడప్పుడు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదముందని హెచ్చరించింది.**కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు** ఈ నెల 27, 28 తేదీల్లో కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే సూచనలున్నాయి. కృష్ణా జిల్లాలో అత్యంత భారీ వర్షాలు, విశాఖపట్నం, కాకినాడ, ఉభయ గోదావరి, కోనసీమ, ఏలూరు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి** తుఫాను పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని, సముద్రంలో ఉన్నవారు వెంటనే తీరానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. ప్రజలు అత్యవసర వస్తువులు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, బలమైన గాలులు వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదని హెచ్చరించారు. అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## షర్మిలకు జగన్ లేఖ.. బెంగళూరు నివాసంలో పెళ్లికి అభ్యంతరం!

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో అతిథులు, వివాహ ఏర్పాట్ల సిబ్బంది రాకపోకలతో తన భద్రతకు, వ్యక్తిగత గోప్యతకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు.వివాహ వేడుకకు వచ్చే వారిలో చాలామంది తనకు పరిచయం లేని వ్యక్తులేనని, వారి రాకపోకల వల్ల నివాసానికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలు బయటకు వెళ్లే ప్రమాదం ఉందని జగన్ ఆందోళన వ్యక్తం చేసినట్లు కథనం తెలిపింది. కుటుంబంలో విభేదాలు ఉన్నప్పటికీ, అంజలి సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## నవంబర్ 10 తర్వాతే ర్యాలీ నిర్వహించండి!

(మొదటి పేజీ తరువాయి)

దీపావళి పండుగ కొనుగోళ్లు జోరుగా సాగే సమయంలో ర్యాలీ నిర్వహిస్తే వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలిగి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. నవంబర్ 10 తర్వాత ర్యాలీ నిర్వహించాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు బృజేశ్ గోయల్ లేఖ రాశారు.**రూ.25 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం** నవంబర్ 6న ధన్‌తేరస్, 8న దీపావళి, 10న భాయీ దూజ్ పండుగలు ఉండటంతో ఢిల్లీలోని మార్కెట్లలో కొనుగోళ్లు భారీగా పెరుగుతాయని వ్యాపారులు తెలిపారు. ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.25 వేల కోట్ల వ్యాపారానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇప్పటికే అక్టోబరులో నిరసనలు, రహదారులపై ఆంక్షల కారణంగా సుమారు రూ.3 వేల కోట్ల మేర నష్టం జరిగినట్లు తమ లేఖలో పేర్కొన్నారు.**రవాణాకు అంతరాయం కలిగే అవకాశం** రామ్‌లీలా మైదానం పరిసరాల్లోని చాందినీ చౌక్, సదర్ బజార్ సహా సుమారు 20 ప్రధాన టోకు, చిల్లర మార్కెట్లపై ర్యాలీ ప్రభావం పడవచ్చని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారుల మళ్లింపు, అడ్డంకులు, రాకపోకలపై ఆంక్షలతో వినియోగదారులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.మరోవైపు, ఓట్ల చోరీ ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో నవంబర్ 1న భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఇండియా కూటమి సన్నాహాలు చేస్తోంది. పండుగల సమయంలో వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ర్యాలీ తేదీని మార్చాలని ఢిల్లీ వ్యాపారుల సంఘం కోరింది.

## ఇరాన్‌పై మరోసారి దాడులు చేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

రాకపోతే ఇరాన్‌పై మరో విడత పరిమిత సైనిక చర్యలు చేపట్టే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అయితే, ఇరాన్ ఇప్పటికైనా ఒప్పందానికి రావచ్చని, చర్చల ద్వారా సమస్య పరిష్కారమయ్యే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని పేర్కొన్నారు. ఒప్పందం ద్వారా లేదా మరో మార్గంలోనైనా యుద్ధం ముగుస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.మరోవైపు, అమెరికా హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు దిగితే గల్ఫ్ ప్రాంతంలోని కీలక మౌలిక సదుపాయాలు, సముద్రగర్భ సమాచార కేబుళ్లు, సైనిక స్థావరాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఇరాన్‌కు చెందిన ఓ సైనిక అధికారి హెచ్చరించినట్లు సమాచారం. తమను తక్కువ అంచనా వేయవద్దని అమెరికాకు సంకేతాలు పంపింది.ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. ఆ ప్రాంతంలోని పలు దేశాల్లో పనిచేస్తున్న తమ దౌత్య ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టినట్లు సమాచారం. అమెరికా అధికారులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులకు ప్రణాళికలు రూపొందించిందన్న నిఘా వర్గాల సమాచారంతో విదేశాంగ శాఖ అప్రమత్తమైనట్లు కథనం పేర్కొంది.అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందంపై స్పష్టత రాకపోవడం, ఇరుపక్షాల నుంచి పరస్పర హెచ్చరికలు వెలువడటంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రతపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్ పాలనలో అన్నదాత బతుకే ప్రశ్నార్థకం!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన ఘటనను, తాజాగా విద్యుత్ సరఫరా సమస్యపై ప్రశ్నించిన రైతుపై ఎస్సై లాఠీతో దాడి చేసిన ఘటనను హరీశ్‌రావు ప్రస్తావించారు. రైతుల సమస్యలను శాంతియుతంగా విని పరిష్కరిం చాల్సిన అధికారులు, వారిపట్ల కఠినంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. రైతులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే దాడులు చేయడం, అవమానించడం ప్రజాపాలనకు నిదర్శనం కాదని వ్యాఖ్యానించారు.రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి సమస్యలను పట్టించుకోకుండా ఇలాంటి ఘటనలు చోటుచేసుకునేలా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు గౌరవం, భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రైతులపై దాడులకు పాల్పడిన ఘటనలపై ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పర్వతగిరిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- పర్వతగిరి ఎస్హెచ్ఓ, ఎస్సై పి. రాజ్ కుమార్
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదు
- మహిళలు, వృద్ధుల సమస్యలపై తక్షణ స్పందన
- సైబర్ నేరాలు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబర్ 24:** పర్వతగిరి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, ప్రజలకు చేరువయ్యే దిశగా పర్వతగిరి పోలీస్ శాఖ దూకుడు పెంచింది. ఈ నేపథ్యంలో పర్వతగిరి ఎస్హెచ్ఓ, ఎస్సై పి. రాజ్ కుమార్ ప్రజలను ఉద్దేశించి స్పష్టమైన, కఠిన హెచ్చరికలతో కూడిన పబ్లిక్ అడ్వైజరీని విడుదల చేశారు. ప్రజల రక్షణే తమ ప్రథమ కర్తవ్యమని, శాంతిభద్రతలకు భంగం కలిగించినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ప్రతి ఒక్క బాధితుడికి పూర్తి భరోసా కల్పిస్తామని, ప్రజలు ఏ సమయంలోనైనా తమ సమస్యలను నిర్భయంగా వచ్చి పంచుకోవచ్చని తెలిపారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సత్వర న్యాయం చేస్తామని ఆయన అన్నారు.**అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలు:**సైబర్ మోసాలు: ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, లాటరీ ఫ్రాడ్స్ పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలి.ఎట్టి పరిస్థితుల్లోనూ మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎమ్ పిన్ నంబర్లు, ఓటీపీలను ఇతరులకు చెప్పకండి. సైబర్ కేటుగాళ్ల ఉచ్చులో పడి సొమ్ము పోగొట్టుకోవద్దు.యువతకు హితవు: యువత చెడు వ్యసనాలకు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దు.దీనిపై గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలు: ప్రయాణాల్లో ప్రాణ రక్షణే మనకందరికీ ముఖ్యం. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలనీ కోరారు.అసాంఘిక కార్యకలాపాలు: మండలంలో జూదం, పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, గొడవలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతాం. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నించవద్దు. అసాంఘిక శక్తుల భరతం పడతాం అని పేర్కొన్నారు.సోషల్ మీడియా వదంతులు: సోషల్ మీడియా వేదికగా వచ్చే పనికిరాని వదంతులు, ప్రజలను రెచ్చగొట్టే పోస్టులను ఎవరూ నమ్మవద్దు, ఫార్వార్డ్ చేయవద్దు. శాంతిభద్రతలకు విఘాతం కలిపేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ సమయాల్లో తక్షణ సహాయం కోసం ప్రజలు వెంటనే డయల్ 112ను లేదా నేరుగా పర్వతగిరి పోలీస్ స్టేషన్ నంబర్‌ను సంప్రదించి సేవలు పొందవచ్చు. పోలీసులు మీ రక్షణ కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటారని ఎస్సై స్పష్టం చేశారు.

# రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రాణాంతకం

- క్షణాల ఆరాటం కోసం ప్రాణాలను పణంగా పెట్టకండి
- నాచారం ఎస్హెచ్ఓ, సీఐ ధనుంజయ




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబర్24:** రోడ్లపై రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వాహనదారులపై నాచారం ట్రాఫిక్ పోలీసులు తీవ్ర నిరసన,హెచ్చరికలు జారీ చేశారు. క్షణాల ఆరాటం కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నాచారం ఎస్హెచ్ఓ, సీఐ ధనుంజయ ప్రజలను ఉద్దేశించి హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మీరు ఆదా చేసుకునే కొద్ది సెకన్లు మీ ప్రాణాలను వెనక్కి తీసుకురాలేవు అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల జరిగే పెను ప్రమాదాలను ఆయన వివరించారు.తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం వల్ల తీవ్రమైన ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగే ముప్పు రెట్టింపు అవుతుంది అని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించడం వల్ల రోడ్డుపై ప్రయాణించే ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి అని విచారం వ్యక్తం చేశారు.రాంగ్-వే ప్రయాణం వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి అంబులెన్స్‌ల రాకపోకలకు కూడా ఇబ్బంది కలుగుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.దయచేసి అందరూ సరైన మార్గంలోనే ప్రయాణించండి ప్రతి ఒక్కరి ప్రాణాన్ని కాపాడుకోండి అని సీఐ ధనుంజయ విజ్ఞప్తి చేశారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# చౌటుప్పల్ కాంగ్రెస్‌లో సంస్థాగత సమరానికి శ్రీకారం!

**20 వార్డుల్లో నూతన కమిటీలు..**

**త్వరలో బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు**

**పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం**

**కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం**





**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 24:** మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై కీలక చర్చ జరిగింది.మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో నూతన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు, త్వరలోనే బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రతి వార్డులో పార్టీకి పటిష్టమైన నాయకత్వాన్ని నిర్మించి, బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు.రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్, వైస్ చైర్మన్ శివారెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు, రామాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి పాల్గొన్నారు.అలాగే మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శులు ఇప్ప వెంకటేష్, ఎర్రగుని లింగస్వామి యాదవ్, ఉపాధ్యక్షులు వెంకట్ కుమార్, అంతటి విజయలక్ష్మి బాలరాజు, చెరుకు లింగస్వామి, బండమీది మల్లేష్, ఎండీ వహీద్, అధికార ప్రతినిధి శ్యామకూర యాదయ్య, కార్యదర్శులు మాదాని గోపాల్, గుండబోయిన మనిత, ఐలయ్య యాదవ్, ఓర్సు శ్రీజా రాజు, ఎండీ ఫరోజ్, దుబ్బాటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, సుమతి తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరోనా కష్టకాలంలోనూ రైతుబంధు ఆపని కేసీఆర్.. రైతుల పాలిట నిజమైన బాంధవుడు!

**ఎమ్మెల్యేలు, ఎంపీల జీతాలు నిలిపివేసి మరీ రైతులకు అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్**

**ఢిల్లి మాధవరెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, చౌటుప్పల్ మండలం**



**తొలి అక్షరం/చౌటుప్పల్:అక్టోబర్ 24:** కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, చౌటుప్పల్ మండలానికి చెందిన ఢిల్లీ మాధవరెడ్డి అన్నారు.దేశమంతా కరోనా కష్టాలతో సతమతమవుతున్న సమయంలోనూ రైతుల సంక్షేమాన్ని విస్మరించకుండా రైతుబంధు పథకం ద్వారా అన్నదాతలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ, వ్యవసాయ రంగానికి అండగా నిలిచి, అన్నం పెట్టే రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతు బాంధవుడు కేసీఆర్ అని కొనియాడారు.రైతు సంక్షేమం కోసం కష్టకాలంలోనూ వెనుకడుగు వేయకుండా రైతులకు భరోసా కల్పించిన కేసీఆర్ సేవలను రైతులు ఎప్పటికీ మరచిపోలేరని ఢిల్లీ మాధవరెడ్డి అన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

**- నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత: చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్**






**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 24:** ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ సూచించారు. నీటి పొదుపు, పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై శనివారం చౌటుప్పల్‌లోని పలు వార్డుల్లో అవగాహన సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుళాయిలు, పైపుల లీకేజీలను అరికట్టి నీటి వృథాను నివారించాలని కోరారు. కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ సహజ వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలువురు వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలి



**రానున్న 10 నెలలు తాగునీటి**

**అవసరాలకు అత్యంత ప్రాధాన్యం:**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**విద్యుత్ కోతలు లేకుండా**

**సరఫరా.. నీటి సంరక్షణ పనులతో**

**గ్రామీణులకు ఉపాధి**

**తొలి అక్షరం/చింతకాని, అక్టోబర్ 24:** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రానున్న పది నెలల పాటు మనుషులు, పశువుల తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పర్యటన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోని చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వర్షపు నీటిని సంరక్షించే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు, భూగర్భ జలాల పెంపు నిర్మాణాలు చేపట్టడంతో పాటు చెరువుల్లో పూడికతీత పనులు నిర్వహిస్తామని చెప్పారు.**విద్యుత్ కోతలు లేకుండా సరఫరా** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొత్త ఉపకేంద్రాల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. భూగర్భ జలాలు తగ్గిన ప్రాంతాల్లో రైతులు నీరు లేకుండా మోటార్లు నడపవద్దని, స్వయంచాలక ప్రారంభ పరికరాలను తొలగించాలని సూచించారు. **ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణ**కరువు పరిస్థితుల్లో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, పశువుల నీటి తొట్టెలు, కాలువల శుభ్రత, చెరువుల పూడికతీత వంటి పనులు చేపడతామని తెలిపారు. రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని, ప్రజలంతా నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులపై సమీక్ష

- వైద్య సేవలు, పరికరాల కొనుగోలు, ఖాళీ పోస్టుల భర్తీపై అధికారుల పరిశీలన




**తొలి అక్షరం/ఖమ్మం, అక్టోబర్ 24:** ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య సేవలు, అభివృద్ధి పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు పాల్గొన్నారు.ఈ సమావేశంలో వైద్యుల హాజరు, వైద్య పరికరాల కొనుగోలు, రోగుల రవాణాకు అవసరమైన స్ట్రెచర్ల సమకూర్పు, భవన నిర్మాణ పనులు, ఖాళీ పోస్టుల భర్తీ, ఆసుపత్రి విభాగాల తరలింపు అంశాలను సమీక్షించారు. ఆయా అంశాలపై అక్టోబర్ 1 నుంచి 20వ తేదీ వరకు వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఇన్‌చార్జి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణు మాధవరావు, ఏవో మమత, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ తాగునీటి సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ హెచ్చరిక

**- కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను వెంటనే ఎత్తిపోసుకోవాలి**





**తొలి అక్షరం/మహాదేవపూర్, అక్టోబర్ 24:** హైదరాబాద్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నా, వాటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా జలాలను నిల్వ చేసుకోవాలని, కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు జలాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

**• బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య**



**తొలి అక్షరం/పెద్దవంగర అక్టోబర్ 24:** మండలంలోని బొమ్మకల్ గ్రామం లో జరిగిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం లొ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలియచేసారు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉండటం ద్వారా తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా తెలియజేసే అవకాశం ఉంటుందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన యువత, ఇతర పట్టభద్రులు ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణీత నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. యువతతో పాటు పట్టభద్రులందరూ ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ,మండల పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీరాం సంజయ్,గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డబోయిన గంగాధర్,మాజీ ఎంపీటీసీ పాసులేటి వెంకటరామయ్య,మాజీ సర్పంచ్ దంతాలపల్లి సాయిలు,మండల పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు కూకట్ల యాకన్న,పొడిశెట్టి సమ్మయ్య, ఆర్కే తండా సర్పంచ్ బానోతు యమునా రాకేష్,మాజీ ఉప సర్పంచ్ గిరగని ఐలయ్య,పట్టభద్రులు గిరగని రవి,మండల పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్రసాని రాంమూర్తి,గంగారపు మధు, బానోతు రాజకుమార్,బానోతు విక్రమ్, జాటోతు వెంకన్న, గిరగాని భారత్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# స్పృహ కోల్పోయిన వృద్ధుడికి యశోదా వైద్యుల అత్యవసర న్యూరోసర్జరీ

**• మెదడులో రక్తస్రావం.. 76 ఏళ్ల వృద్ధుడికి ప్రాణరక్షక చికిత్స**

**• బహుళ వైద్య విభాగాల సమన్వయంతో వృద్ధుడికి మెరుగైన వైద్యం**




**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 24:** షాద్‌నగర్‌కు చెందిన 76 ఏళ్ల వృద్ధుడు అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడంతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. ఈ వివరాలను షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని దేవి గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. న్యూరోసర్జన్ డాక్టర్ సాయుజ్ కృష్ణన్ ఎస్ కేసు వివరాలను వివరించారు. సీటీ స్కాన్‌లో మెదడులో రక్తస్రావం, హైడ్రోసెఫలస్ ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి, మెదడులో పేరుకుపోయిన ద్రవాన్ని బయటకు పంపేందుకు ప్రత్యేక డ్రెయిన్ అమర్చారు. రోగికి ఎడమవైపు పక్షవాతం ఉండటంతోపాటు స్పృహ స్థాయి తగ్గింది. ఐసీయూలో వెంటిలేటర్ సహాయం, మెదడు వాపు నియంత్రణకు చికిత్స, అవసరమైన మందులు అందించారు. దీర్ఘకాలిక శ్వాస సహాయం అవసరం కావడంతో ట్రాకియోస్టమీ నిర్వహించారు. గుండె పనితీరు, రక్తపోటు, ఇతర సమస్యలను సంబంధిత వైద్య నిపుణులు పర్యవేక్షించారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం స్థిరపడటంతో కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ ఫిజియోథెరపీ, శ్వాస మార్గ సంరక్షణ, నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరమని వైద్యులు సూచించారు. అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం లేదా తీవ్రమైన నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే అత్యవసర వైద్యంలో ఆలస్యం చేయవద్దని ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర సూచించారు.

# ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యం

**- ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్ సత్య శారద**





**తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 24:** ఎల్-నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి బొట్టును సంరక్షించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద సూచించారు. నెక్కొండ మండలం పత్తిపాక గ్రామంలో ఉపాధి హామీ పనులను, ప్రభుత్వ పాఠశాలలను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల పురోగతిని కూలీలు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలు, బోరు బావుల పునరుద్ధరణ నిర్మాణాలు, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని సూచించారు. రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని, నీటి సంరక్షణను సామూహిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పత్తిపాక ప్రాథమిక, ప్రీ-ప్రైమరీ పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు సరిపడా బెంచీలు, మెరుగైన వెలుతురు సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగ పద్మజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వసంత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గిరాయిగుట్ట తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- నీటిని పొదుపుగా వాడుకోవాలి: సర్పంచ్ కృష్ణవేణి హరినాయక్**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 23:** ఫరూక్‌నగర్ మండల పరిధిలోని గిరాయిగుట్ట తండా గ్రామపంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కృష్ణవేణి హరినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా నీటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నందున ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకొని వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, జీపీవో సత్తయ్య, రేషన్ డీలర్ రఘు, ఉపసర్పంచ్ రాజు, వార్డు సభ్యులు రాజు, సువర్ణ, మురళి, సరిత, కిషన్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పెంటు, బాలు, నరేష్, మంగులాల్, గోపాల్, గ్రామ సిబ్బంది, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# బాలల భద్రతకు వీసీపీసీ కమిటీ ఏర్పాటు

**- బాల్య వివాహాలు, వేధింపుల నివారణకు అవగాహన**





**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 24:** బాలల హక్కుల పరిరక్షణ, భద్రతే లక్ష్యంగా షాద్‌నగర్ పట్టణంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో వీసీపీసీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలలపై హింస, వేధింపులు, బాల్య వివాహాల నివారణపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. బాలలకు రక్షణ కల్పించడంలో తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాలలపై హింస, వేధింపులు జరిగినప్పుడు వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ ఆరిఫా బేగం, 20వ వార్డు కౌన్సిలర్ పినమోని గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఐసీపీఎస్ కోఆర్డినేటర్ శ్రీలత, అశ్విత సంస్థ కోఆర్డినేటర్ గీత, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. యువతకు పిలుపు

**- నశా ముక్త్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి: కౌన్సిలర్ అశోక్ ప్యాట్**

**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 24:** మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ అశోక్ కుమార్ ప్యాట్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఏఎం డిగ్రీ కళాశాలలో మై భారత్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన, యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ ప్యాట్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్షణికమైన మత్తు కోసం విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువతను డ్రగ్స్ నుంచి కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేయాలన్నారు. యువత విద్య, క్రీడలు, సామాజిక సేవపై దృష్టి సారించాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రణయ్ కుమార్, సూర్యప్రకాశ్, కళాశాల నిర్వాహకులు విజయ్, మై భారత్ కోఆర్డినేటర్ మహేష్, బీజేవైఎం నాయకుడు దాదే మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.




# చిన్నారులను ఆశీర్వదించిన కందిమల్ల గోపాల్ రెడ్డి



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 24:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందినఆవుల వెంకటేశ్ యాదవ్- లావణ్య దంపతుల కుమార్తె వైష్ణవి నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో శోభనాద్రిపురం గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ గ్రామ పెద్దలు ఆవుల సత్యనారాయణ ఆవుల పర్వతాలు నోముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ఎల్-నినో ప్రభావంపై గ్రామసభలు



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 24:** ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని కొత్తగూడెం, లక్ష్మాపురం, శోభనాద్రిపురం గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. ఈ సభల్లో రైతులకు ఆరుతడి పంటలు సాగు చేయాలని, నీటిని పొదుపుగా వాడాలని, ఉపాధి హామీ పథకం, జలశ్రీ పనుల కింద ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ తవ్వుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలు ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన జరిగాయి. కొత్తగూడెం సర్పంచ్ బద్దం యాదమ్మ యాదగిరి, లక్ష్మాపురం సర్పంచ్ పులిపరుపుల సునీత వీరస్వామి, శోభనాద్రిపురం సర్పంచ్ కంచి మధుసూదన్ లు అధ్యక్షత వహించారు. మండల ప్రత్యేక అధికారి కె. రాఘవ రెడ్డి, ఎంపీడీఓ ఆవుల రాములు, తహసీల్దార్ లాల్ బహదూర్, ఏఈలు ఆశిష్, రాఘవ, సందీప్, ఎంపీవో రఫీ, సర్పంచులు, కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు

**- ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి: షాద్‌నగర్ ఆర్డీఓ సరిత**



**తొలి అక్షరం / షాద్‌నగర్, అక్టోబర్ 24:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులు నవంబర్ 6, 2026లోగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని షాద్‌నగర్ ఆర్డీఓ ఎన్.ఆర్. సరిత సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఫారం18 ద్వారా ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతోపాటు అవసరమైన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ నమోదు కోసం 'సీఈఓ తెలంగాణ' వెబ్‌సైట్‌ను, ఇతర వివరాల కోసం సంబంధిత తహసీల్దార్ లేదా మున్సిపల్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి కనీసం మూడేళ్ల క్రితం డిగ్రీ ఉత్తీర్ణులైన పట్టభద్రులు అర్హులని తెలిపారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

# బూర్గుల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు రూ.10 కోట్లు

## - పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 24:** షాద్‌నగర్‌లోని బూర్గుల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం తొలి విడతగా రూ.10 కోట్లు విడుదల చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలు విద్యావంతులైతేనే సమాజాభివృద్ధి

## ఫరూక్‌నగర్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా ఉర్దూ అభ్యసన కార్యక్రమం ప్రారంభం





**తొలి అక్షరం / ఫరూక్‌నగర్, అక్టోబర్ 24:** మహిళా అక్షరాస్యత పెంపే లక్ష్యంగా ఫరూక్‌నగర్‌లో తెలంగాణలోనే తొలిసారిగా ఉల్లాస్ కార్యక్రమంలో ఉర్దూ భాషా అభ్యసనాన్ని వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మార్చిలోగా మండలంలో 5,500 మందికి విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, డిప్యూటీ డైరెక్టర్ అనిత, ఆలియా సుల్తానా, అధికారులు పాల్గొన్నారు. ఉర్దూ అభ్యసన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో శనగ సాగుకు ప్రోత్సాహం

## - 40 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ



**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 24:** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడెం మండల రైతు వేదికలో రైతులకు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. తక్కువ నీటితో సాగయ్యే శనగ పంటను ఎంపిక చేసుకోవాలని, నేలలో తేమ, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సహకార సంఘం ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# చిరుమర్తి తీరు 'దొంగే దొంగ' అన్నట్లుగా ఉంది

## - కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జమీరొద్దీన్ విమర్శలు



**తొలి అక్షరం / రామన్నపేట, అక్టోబర్ 24:** మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీరు 'దొంగే దొంగ' అన్నట్లుగా ఉందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జమీరొద్దీన్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పల్లివాడలో సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్ మద్యం సేవించి కాంగ్రెస్ కార్యకర్తతో పాటు అడ్డుకున్న కుటుంబ సభ్యులు, ఓ మహిళపై దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై చట్టం తన పని తాను చేసుకుపోతుంటే కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. తప్పు చేయకపోతే సర్పంచ్ ఎందుకు తప్పించుకుని తిరుగుతున్నారని ప్రశ్నించారు. పోలీసులను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే మాట్లాడటం తగదని, ప్రతి అంశంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పేరును ప్రస్తావిస్తూ అప్రతిష్ఠ కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోటే రమేష్, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, జెల్ల వెంకటేష్, కోట సుధాకర్, మోటే మహేష్, తుర్కపల్లి సర్పంచ్ సల్ల పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

## • రూ.125 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/చింతకాని, అక్టోబర్ 24:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. పొద్దుటూరులో రూ.3.5 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం, తిమ్మినేనిపాలెంలో రూ.8.25 కోట్లతో రహదారి నిర్మాణం, రామకృష్ణాపురంలో రూ.3 కోట్లతో మరో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామకృష్ణాపురంపెద్దగోపతి రహదారికి రూ.50 కోట్లతో, కొదుమూరులో వెంకటపాలెం నుంచి చింతకాని రహదారి వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణకు రూ.60 కోట్లతో చేపట్టనున్న పనులకు శ్రీకారం చుట్టారు. తిమ్మినేనిపాలెం ఎస్సీ కాలనీలో రూ.62 లక్షలతో, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి బోనాల్లో పాల్గొన్న దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 24:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని తాటికల్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ ఆత్మీయ మిత్రులు ముదిరాజుల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ గారు హాజరై పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి, తాటికల్ గ్రామ సర్పంచ్ బంటు రవి, గ్రామ శాఖ అధ్యక్షులు పోలగాని వెంకటేష్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జ్యోతి బస్, కాంగ్రెస్ నాయకులు అంజీ, శివకృష్ణ, ముచ్చపోతుల లింగయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి

## - పనుల నాణ్యతపై ప్రతి 2, 3 వారాలకోసారి సమీక్షించాలి: మంత్రి తుమ్మల



**తొలి అక్షరం / ఖమ్మం, అక్టోబర్ 24:** ఖమ్మం నగరంలోని వైఎస్సార్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో రూ.1.30 కోట్లతో నిర్మించనున్న ఐదు అదనపు తరగతి గదుల పనులను మూడు నెలల్లో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనుల పురోగతిని ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి క్షేత్రస్థాయిలో సమీక్షించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వైఎస్సార్ కాలనీలో ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడంతోపాటు ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రాలు అందించాలని అధికారులను ఆదేశించారు. 2023లో మంజూరైన రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పత్తిపాక తండాలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

## • నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.. సర్పంచ్ సామ్యా నాయక్ చొరవ



**తొలి అక్షరం / నెక్కొండ, అక్టోబర్ 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పత్తిపాక తండాలో కొన్నేళ్లుగా వేధిస్తున్న తక్కువ విద్యుత్ వోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సర్పంచ్ లావుడియా సామ్యా నాయక్ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. పాత ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోక సాయంత్రం వేళల్లో తక్కువ వోల్టేజీతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు కృషి చేశారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్‌కు తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బానోతు విజేందర్, రజిత, లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ ప్రవీణ్‌కుమార్, మాజీ వార్డు సభ్యురాలు అనూష, మోహన్, లైన్‌మన్ లక్ష్మణ్, తండా ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుట చిరుమర్తి ధర్నా

## - బాధితులపై కేసులు ఉపసంహరించుకోవాలి.. ఎస్సైని సస్పెండ్ చేయాలి











**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 24:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడలో దుర్గామాత శోభాయాత్ర సందర్భంగా జరిగిన ఘర్షణపై బీఆర్ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ కంబంపాటి శ్రీను, మహిళలు, విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు నాలుగున్నర గంటల పాటు కొనసాగిన ఆందోళనపై జిల్లా ఎస్పీ స్పందించి, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ బాధితులపైనే కేసులు నమోదు చేయడం అన్యాయమని ఆరోపించారు. స్థానిక ఎస్సైని సస్పెండ్ చేయాలని, కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. మరోవైపు, ఎస్సై సతీష్‌పై బాధితులు పోలీస్‌స్టేషన్‌లోనే సీఐకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## - రైతుల సమస్యల పరిష్కారానికి పోరాట కార్యాచరణ: జల్లెల పెంటయ్య



**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 24:** నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామన్నపేటలో మహాసభల కోసం విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1,500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాలు, పంట నష్టపరిహారం, గిట్టుబాటు ధరలు, ఎరువుల ధరల తగ్గింపు, రుణ విముక్తి వంటి అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుల హనుమంతు, గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పట్టు వస్త్రాలంకరణలో పాల్గొన్న దైద రవీందర్

**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 24:** నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డ కాలనీకి చెందిన వంటెపాక కృష్ణదుర్గ దంపతుల కుమార్తెల పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రీసర్వే పనులను వేగవంతం చేయాలి

## రఘునాథగూడెంలో 800 ఎకరాల్లో సర్వే పూర్తి చేసిన అధికారులు

**తొలి అక్షరం/కల్లూరు, అక్టోబర్ 24 :** కల్లూరు మండలం రఘునాథగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో మొత్తం 1,167 ఎకరాల విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు సుమారు 800 ఎకరాల్లో సర్వే పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ భూముల హద్దులను కచ్చితంగా గుర్తించాలని, భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, నిర్ణీత లక్ష్యాల మేరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో స్పష్టత ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.



గ్రామస్థులతో మాట్లాడి రీసర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు, భూయజమానులు సర్వే బృందానికి సహకరించి, తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అందించాలని సూచించారు. ఈ పరిశీలనలో సర్వే సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. **రీసర్వేపై అభ్యంతరాలు, సందేహాలపై ఆరా** పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామంలో నిర్వహించిన భూముల రీసర్వే గ్రామసభకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ హాజరై రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలు, అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వినతులను ఆలకిస్తూ భూముల సర్వే, హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల్లో వివరాల నమోదు తదితర అంశాలపై చర్చించారు. రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, హద్దులను కచ్చితంగా నిర్ధారించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకతను పెంపొందించవచ్చని సబ్ కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియతో రైతులకు తమ భూముల వివరాలపై స్పష్టత ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు రీసర్వే బృందాలకు సహకరించాలని, తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అందించాలని సూచించారు. భూ సమస్యలు, సందేహా లు ఉంటే గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురా వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాత్రాస్ హోమియోపతి క్లినిక్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ నక్కలగుట్ట లోని మిత్ర లక్ష్మీనారాయణ భవన్ లో డాక్టర్ బాత్రాస్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో హోమియోపతి క్లినిక్ ను మాజీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ ప్రారంభోత్సవం చేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద హోమియోపతి క్లినిక్ నెట్వర్క్ కలిగిన డాక్టర్ బాత్రాస్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో వరంగల్లో శాస్త్రీయంగా నిరూపితమైన సురక్షితమైన హోమియోపతి క్లినిక్ లో వరంగల్లో ప్రారంభించడం ఆనందంగా ఉందని డాక్టర్ సయ్యద్ ఇర్ఫాన్ హెడ్ మెడికల్ సర్వీసెస్ సౌత్ హెడ్ విక్రమ్ ధావన్ తెలియజేశారు.భారతదేశంలోని ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు ఒకరైన పద్మశ్రీ డాక్టర్ ముఖేష్ బాత్ర స్థాపించిన ఈ డాక్టర్ బాత్రాస్ భారత దేశంలో అనేక మార్పులు తీసుకొస్తూ ఆరోగ్యం పై ప్రత్యేకమైన హోమియోపతి మందులను తయారు చేస్తూ అందుబాటులో ఉంచుతున్నారు.డాక్టర్ బాత్రాస్ హెల్త్ కేర్ ద్వారా జుట్టు చర్మము అలర్జీ శ్వాసకోశ సమస్యలు సౌందర్య సంరక్షణకు సంబంధించిన హోమియోపతి చికిత్స తో పాటు ఆధునిక అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.మాజీ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ వరంగల్ ప్రజలకు డాక్టర్ బాత్రాస్ హోమియోపతి హెల్త్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం అందులో తనను భాగస్వాములుగా చేర్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిచంద్ర,డాక్టర్ విక్రమ్ ధావన్ తో పాటు డాక్టర్ బాత్రాస్ హెల్త్ కేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కాకతీయ గౌడ హాస్టల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** బహుజన యోధుడు,వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం హన్మకొండలోని కాకతీయ గౌడ హాస్టల్‌లో విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ ఓ బీ సీ సెల్ జాతీయ కన్వీనర్ కత్తి వెంకటస్వామి గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను,బహుజనుల ఆత్మగౌరవం కోసం ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని,సమాజ అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు అనంతుల రమేష్ గౌడ్,జూలూరి రంజిత్ గౌడ్,మార్క రవి గౌడ్,కూనూరు రంజిత్ గౌడ్,డాక్టర్ సోల్తి కిరణ్ గౌడ్,మాచర్ల శరత్ గౌడ్,గౌడ సంఘం నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్,జనార్దన్ గౌడ్,మోహన్ గౌడ్,బొనగాని యాదగిరి గౌడ్,బైరి రవికృష్ణ గౌడ్,తీగల జీవన్ గౌడ్,స్వామి గౌడ్,యుగేందర్ గౌడ్,హరీష్ గౌడ్,జగన్ గౌడ్,మార్క విజయ్ గౌడ్,సంజయ్ గౌడ్,సోల్తి సారయ్య గౌడ్,ఏకాంతం గౌడ్,గోపి గౌడ్,రాంకీ గౌడ్,సాగర్ గౌడ్,విజయ్ గౌడ్,కుమార్ గౌడ్,తేజ,ప్రజాప్రతినిధులు,యువకులు,పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పట్టభద్రులూ.. ఓటరుగా నమోదు చేసుకోండి!

## అర్హులంతా ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**తొలి అక్షరం / షాద్‌నగర్, అక్టోబర్ 24:** మహబూబ్‌నగర్ హైదరాబాద్ రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసినవారు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు అవసరమైన ధ్రువపత్రాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటలపై దృష్టి

## - 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ



**తొలి అక్షరం / షాద్‌నగర్, అక్టోబర్ 24:** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తంరెడ్డి, సీనియర్ నేత కృష్ణారెడ్డి సూచించారు. శనివారం మండల రైతు వేదికలో సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు.ఎన్‌బీఈజీ 47 రకం శనగ విత్తనాలు 7.5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, క్వింటాలు రూ.10 వేల విలువైన విత్తనాలను 40 శాతం సబ్సిడీతో రూ.6 వేలకే అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు ప్రభాకర్, శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# నూతన ఎస్సైకి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల శుభాకాంక్షలు

## ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు కాపాడాలి కల్లూరు ఎస్సై జె. నాగరాజును కోరిన నాయకులు





**తొలి అక్షరం/కల్లూరు, అక్టోబర్ 24 :** కల్లూరు మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జె. నాగరాజును ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజుకు అభినందనలు తెలియజేసి, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తూ పోలీస్ శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు.మండలంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటూ, ప్రజలకు రక్షణ కల్పించడంలో ఎస్సై నాగరాజు కీలక పాత్ర పోషించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్స్ అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పరిగడుపు రాము, దారెల్లి వెంకటేశ్వర్లు (డీవీ), చాట్ల సునీల్ కుమార్, గొల్లమందల రవికాంత్, మల్లాది బసవయ్య, పెద్ద రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పరమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం ప్రారంభం












**తొలి అక్షరం/కరీంనగర్, అక్టోబర్ 24:** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న రెండు రోజుల లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం కరీంనగర్‌లోని మంకమ్మతోట పరమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమం ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా గవర్నర్ మోరా భద్రేశం శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల నైపుణ్యాల పెంపునకు, విద్యార్థుల్లో మంచి విలువలు మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడానికి లయన్స్ సంస్థ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన పాల్గొనడం మరింత ప్రోత్సహించింది.ఈ కార్యక్రమానికి చిదుర సురేష్, వల్లా కృష్ణ హరి, కొల్లూరి ఆనందం, పరమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ప్రసాద్ రావు, సింగంరాజు, శంకర్ ప్రసాద్ రెడ్డి, ముక్క శరత్ కృష్ణ, కొండపల్లి రేణుక, కోల అన్న రెడ్డి, తదితర ప్రముఖులు, లయన్స్ సభ్యులు, విద్యారంగ ప్రతినిధులు హాజరయ్యారు.లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భావోద్వేగ సమతుల్యత, సానుకూల సంబంధాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సామాజిక బాధ్యత వంటి కీలక జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఈశిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులకు విద్యార్థుల మానసిక, సామాజిక, విద్యా వికాసానికి తోడ్పడే ఆచరణాత్మక బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమ నిర్వహణకు అమూల్యమైన సహకారం, ప్రోత్సాహం అందిస్తూ, లయన్స్ క్వెస్ట్ కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేయడానికి విశేషంగా కృషి చేస్తున్న పరమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ప్రసాద్ రావు కి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాణ్యమైన విద్యను ప్రోత్సహించడంలో, విద్యార్థుల సమగ్ర వికాసానికి తోడ్పడటంలో ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిఒచేందుకు విశేష చొరవ చూపిన లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మైదం శివకాంత్ నాయకత్వాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన క్లబ్ కార్యదర్శి బట్టు వినోద్, కోశాధికారి మెతుకు చైతన్య గార్ల సేవలను కూడా ప్రశంసించారు.విద్యారంగం ద్వారా సమాజ సేవ చేయడం, ఉపాధ్యాయులను శక్తివంతం చేయడం, విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వాన్ని మరియు సామాజిక బాధ్యతను పెంపొందించడం తమ లక్ష్యమని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ప్రతినిధులు తెలిపారు.ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించాలనే సంకల్పంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వివరించారు.ఉపాధ్యాయులకు సాధికారత భావి తరాలకు బలమైన పునాది అనే ఆశయంతో లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం ముందుకు సాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

# ఉత్కంఠ పోరులో భారత్ ఘన విజయం



### న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు

### తిలక్ వర్మ అర్ధశతకం.. నితీశ్ రెడ్డి కీలక భాగస్వామ్యం

### ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 20తో భారత్ ఆధిక్యం

**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల అంతర్జాతీయ టీ20 క్రికెట్ సిరీస్‌లో భారత జట్టు మరో విజయాన్ని నమోదు చేసింది. రెండో మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. అనంతరం 181 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలో కీలక వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అయితే తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి అద్భుతంగా పోరాడి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 20 ఆధిక్యాన్ని సాధించింది. **భారీ స్కోరు సాధించిన న్యూజిలాండ్** టాస్ గెలిచిన భారత జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు భారత బౌలర్లు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలించారు. వరుసగా మూడు వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టు ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో గ్లెన్ ఫిలిప్స్, బెవన్ జాకబ్స్ బాధ్యతాయుతంగా ఆడుతూ జట్టును ఆదుకున్నారు. ఫిలిప్స్ 70 పరుగులు చేయగా, జాకబ్స్ 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు సాధించింది. దీంతో భారత్ ముందు 181 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **లక్ష్య ఛేదనలో భారత్‌కు ఎదురుదెబ్బలు**181 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురయ్యాయి. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో భారత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బంది పడ్డారు. కీలక ఆటగాళ్లు వరుసగా వెనుదిరగడంతో ఒక దశలో భారత్ ఐదు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఈ పరిస్థితుల్లో లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా కనిపించినప్పటికీ, తిలక్ వర్మ పట్టుదలతో బ్యాటింగ్ చేస్తూ జట్టు విజయావకాశాలను సజీవంగా ఉంచాడు. **తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి అద్భుత పోరాటం** కీలక సమయంలో క్రీజులో నిలిచిన తిలక్ వర్మ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. అతనికి నితీశ్ కుమార్ రెడ్డి చక్కటి సహకారం అందించాడు. తిలక్ వర్మ అజేయంగా 51 పరుగులు చేయగా, నితీశ్ రెడ్డి అజేయంగా 26 పరుగులు సాధించాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు అజేయంగా 69 పరుగులు జోడించి భారత జట్టుకు విజయాన్ని అందించారు. చివరి ఓవర్లలో సమయోచితంగా ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచారు. దీంతో భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఉత్కంఠభరిత విజయాన్ని సొంతం చేసుకుంది. **సిరీస్‌పై భారత్ పట్టు** ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 20 ఆధిక్యంలో నిలిచింది. వరుసగా రెండు విజయాలు సాధించిన భారత జట్టు మిగిలిన మ్యాచ్‌ల్లోనూ ఇదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లోనూ ఆటగాళ్లు సంయమనంతో ఆడి విజయాన్ని అందుకోవడం జట్టుకు సానుకూల అంశంగా నిలిచింది. మరోవైపు సిరీస్‌లో నిలబడాలంటే న్యూజిలాండ్ తదుపరి మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. ఇరు జట్ల మధ్య జరిగే తదుపరి పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది.

# ముంబై ఇండియన్స్ ప్రధాన శిక్షకుడిగా కీరన్ పొలార్డ్!

### మహేల జయవర్దనే స్థానంలో వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్‌కు బాధ్యతలు

### ఐపీఎల్ 2027 సీజన్‌పై దృష్టి.. జట్టు విజయాలే లక్ష్యంగా కొత్త బాధ్యతలు



**ముంబై, అక్టోబర్ 24:**ఐపీఎల్‌లో ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌ను జట్టు ప్రధాన శిక్షకుడిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన మహేల జయవర్దనే స్థానంలో పొలార్డ్‌కు అవకాశం కల్పించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇప్పటికే జట్టు బ్యాటింగ్ శిక్షకుడిగా పనిచేసిన పొలార్డ్ ఇప్పుడు ప్రధాన శిక్షకుడిగా కొత్త బాధ్యతలు చేపట్టనున్నాడు. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌లో జట్టును విజయపథంలో నడిపించడం ఆయన ముందున్న ప్రధాన లక్ష్యంగా నిలవనుంది.**ముంబై జట్టుతో సుదీర్ఘ అనుబంధం** కీరన్ పొలార్డ్‌కు ముంబై ఇండియన్స్‌తో ఎంతోకాలంగా అనుబంధం ఉంది. ఆటగాడిగా జట్టులో చేరిన ఆయన తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కీలక సమయాల్లో భారీ పరుగులు సాధించడంతో పాటు బంతితోనూ జట్టుకు విజయాలను అందించాడు. ముంబై ఇండియన్స్ సాధించిన ఐదు ఐపీఎల్ టైటిళ్లలో ఆయన కీలక పాత్ర పోషించాడు. ఆటగాడిగా క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం జట్టు బ్యాటింగ్ శిక్షకుడిగా సేవలందిస్తూ యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేశాడు. ఇప్పుడు ప్రధాన శిక్షకుడిగా బాధ్యతలు చేపట్టడం ఆయన క్రికెట్ ప్రస్థానంలో మరో కీలక ఘట్టంగా చెప్పవచ్చు.**యువ ఆటగాళ్లకు మార్గదర్శకత్వం** టీ20 క్రికెట్‌లో అపార అనుభవం కలిగిన పొలార్డ్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడం, జట్టులో సమన్వయాన్ని పెంపొందించడం, కీలక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం ప్రధాన శిక్షకుడిగా ఆయనకు సవాలుగా మారనున్నాయి. ఆటగాడిగా మైదానంలో ఎన్నో ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవం ఆయనకు అదనపు బలంగా నిలవనుంది.**మరోసారి విజేతగా నిలవడమే లక్ష్యం** ముంబై ఇండియన్స్ జట్టు వచ్చే సీజన్‌లో మరోసారి విజేతగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆటగాళ్ల ఎంపిక, సాధన, మ్యాచ్‌లలో అనుసరించాల్సిన వ్యూహాలపై కొత్త శిక్షకుడి పాత్ర కీలకం కానుంది. పొలార్డ్ అనుభవం జట్టుకు ఎంతవరకు ఉపయోగపడుతుందో రాబోయే సీజన్‌లో తేలనుంది. అభిమానులు సైతం ఆయన నాయకత్వంలో ముంబై ఇండియన్స్ మళ్లీ విజయాల బాట పట్టాలని ఆశిస్తున్నారు.



# మూడో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్

- ఆరు ఓవర్లలో 43 పరుగులు.. భారత బౌలర్ల ధాటికి కివీస్ తడబాటు
- గాయంతో ఇషాన్ కిషన్‌కు విశ్రాంతి.. జట్టులోకి వైభవ్ సూర్యవంశీ

**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:** భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న రెండో టీ20 క్రికెట్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయింది. ఆరు ఓవర్లు ముగిసే సమయానికి న్యూజిలాండ్ మూడు వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కివీస్ బ్యాటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.న్యూజిలాండ్ బ్యాటర్ టిమ్ సీఫర్ట్ ఏడు పరుగులు చేసి అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం డారిల్ మిచెల్ ఆరు పరుగులు చేసి భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో తిలక్ వర్మకే క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఫిన్ అలెన్ 16 పరుగులు చేసి ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. దీంతో న్యూజిలాండ్ జట్టు ఆరంభంలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది.ఆ సమయంలో క్రీజులో ఉన్న బెవన్ జాకబ్స్ నాలుగు పరుగులు, గ్లెన్ ఫిలిప్స్ 12 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించారు. మరోవైపు భారత బౌలర్లు ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచుతూ పరుగులను నియంత్రించే ప్రయత్నం చేశారు.**భారత జట్టులో మార్పు**భారత జట్టులోనూ ఒక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా ఇషాన్ కిషన్‌కు విశ్రాంతి ఇవ్వడంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి జట్టులో అవకాశం కల్పించారు. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్ ఈ పోటీలోనూ గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఉత్కంఠ పోరులో భారత్‌దే పైచేయి

### న్యూజిలాండ్‌పై మరో విజయం.. సిరీస్‌లో 20 ఆధిక్యం

### తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి అద్భుత పోరాటం.. నాలుగు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు



**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:**న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ క్రికెట్ సిరీస్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. లక్ష్య ఛేదనలో ఒక దశలో తడబడిన భారత జట్టును తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి అద్భుత బ్యాటింగ్‌తో విజయతీరాలకు చేర్చారు. ఏడో వికెట్‌కు వీరిద్దరూ అజేయంగా కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 20 ఆధిక్యంలో నిలిచింది.**భారీ స్కోరు సాధించిన న్యూజిలాండ్**తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు సాధించింది. ఆ జట్టు బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్ 70 పరుగులతో, బెవన్ జాకబ్స్ 58 పరుగులతో రాణించారు. వీరిద్దరూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ జట్టు స్కోరును పటిష్ఠ స్థితికి చేర్చారు. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టినప్పటికీ, న్యూజిలాండ్ పోటీనిచ్చే స్కోరును నమోదు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు సాధించాడు.**ఛేదనలో భారత్‌కు ఎదురుదెబ్బలు**181 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే ఒడిదుడుకులు ఎదురయ్యాయి. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగులు సాధించలేకపోయారు. కీలక వికెట్లు వరుసగా కోల్పోవడంతో మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొంది. ఒక దశలో భారత్ ఐదు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. లక్ష్యానికి చేరువ కావాలంటే వేగంగా పరుగులు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.**తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి కీలక భాగస్వామ్యం**కష్టాల్లో ఉన్న భారత జట్టును తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి ఆదుకున్నారు. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ అజేయంగా 51 పరుగులు సాధించగా, నితీశ్ కుమార్ రెడ్డి అజేయంగా 26 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు అజేయంగా 69 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించారు. చివరి ఓవర్లలో దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచారు. నితీశ్ రెడ్డి విజయానికి అవసరమైన పరుగులు సాధించడంతో భారత శిబిరంలో ఆనందం నెలకొంది.

**సిరీస్‌పై భారత్ పట్టు** ఈ విజయంతో భారత్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 20 ఆధిక్యాన్ని సంపాదించింది. తొలి మ్యాచ్‌లోనూ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ అదే తరహాలో గెలిచి తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. కీలక సమయంలో వికెట్లు పడిపోయినా ఒత్తిడిని అధిగమించి గెలుపు సాధించడం భారత జట్టు పోరాట పటిమకు నిదర్శనంగా నిలిచింది. మిగిలిన మ్యాచ్‌ల్లోనూ ఇదే జోరు కొనసాగించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

# కివీస్ భారీ స్కోరు.. భారత్ లక్ష్యం 181 పరుగులు!

### ఫిలిప్స్, జాకబ్స్ అర్ధశతకాలతో న్యూజిలాండ్ పుంజుకోలు

### భారత బౌలర్లపై ఎదురుదాడి.. నిర్ణీత 20 ఓవర్లలో 180/5



**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టీ20 అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు పోరాడదగిన స్కోరును సాధించింది. తొలుత టాస్ గెలిచిన భారత జట్టు బౌలింగ్ ఎంచుకోగా, న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. దీంతో భారత్ విజయానికి 181 పరుగులు చేయాల్సి ఉంది. ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన న్యూజిలాండ్‌ను గ్లెన్ ఫిలిప్స్, బెవన్ జాకబ్స్ ఆదుకున్నారు. అర్ధశతకాలతో రాణించడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరును నమోదు చేసింది. **ఆరంభంలోనే కివీస్‌కు ఎదురుదెబ్బలు**తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు భారత బౌలర్లు ఆరంభంలోనే షాక్ ఇచ్చారు. టిమ్ సీఫర్ట్ ఏడు పరుగులకే అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అనంతరం డారిల్ మిచెల్ ఆరు పరుగులు చేసి భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఫిన్ అలెన్ 16 పరుగులు చేసి ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కోల్పోయాడు. దీంతో న్యూజిలాండ్ 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కివీస్ బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.**ఫిలిప్స్, జాకబ్స్ అద్భుత భాగస్వామ్యం**ఈ దశలో క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్, బెవన్ జాకబ్స్ జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ పరుగుల వేగాన్ని పెంచారు. ఫిలిప్స్ 43 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 70 పరుగులు సాధించాడు. మరోవైపు జాకబ్స్ 46 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 58 పరుగులు చేశాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ స్కోరు గణనీయంగా పెరిగింది.**చివర్లో వికెట్లు.. 180 పరుగులకు కివీస్**భారత్‌కు ప్రమాదకరంగా మారిన ఫిలిప్స్‌ను అర్ష్‌దీప్ సింగ్ ఔట్ చేయడంతో కీలక భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత జాకబ్స్ కూడా వెనుదిరిగాడు. చివరి ఓవర్లలో భారత బౌలర్లు వికెట్లు సాధించి పరుగుల వేగాన్ని నియంత్రించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు పడగొట్టగా, ఇతర బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు సాధించారు. **భారత్ ముందు 181 పరుగుల లక్ష్యం** ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్, రెండో మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాలంటే భారత బ్యాటర్లు సమష్టిగా రాణించాల్సి ఉంది. ఆరంభంలో వికెట్లు కాపాడుకుంటూ, మధ్య ఓవర్లలో పరుగుల వేగాన్ని కొనసాగించడం టీమిండియాకు కీలకం కానుంది. మరోవైపు స్వదేశంలో ఆడుతున్న న్యూజిలాండ్ బౌలర్లు భారత బ్యాటర్లను కట్టడి చేసి మ్యాచ్‌లో తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. దీంతో రెండో టీ20 పోరు ఆసక్తికరంగా మారింది.

# 'సీడెడ్', 'నైజాం' వద్దు.. 'రాయలసీమ', 'తెలంగాణ' అనండి

## : దర్శకుడు రాహుల్ సాంకృత్యన్



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'రణబాలి' చిత్రంపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ ప్రచారం చేశారని ఆ చిత్ర దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఆరోపించారు. అనంతపురంలో నిర్వహించిన 'రణబాలి రణభేరి' విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కొందరు రివ్యూయర్లు సినిమాను నెగెటివ్‌గా చూపించే ప్రయత్నం చేసినప్పటికీ... మంచి సినిమాను ఎవరూ ఆపలేరని తెలుగు ప్రేక్షకులు మరోసారి నిరూపించారని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ తన అనంతపురం అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే పెరిగాను. ఇక్కడి థియేటర్లలోనే 'ఇంద్ర', 'నరసింహ నాయుడు' వంటి చిత్రాలు చూశాను. ఇప్పుడు అవే థియేటర్లలో నా సినిమా హౌస్‌ఫుల్ బోర్డులతో నడుస్తుండటం చాలా గర్వంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. మంచి సినిమా ఇస్తే రాయలసీమ ప్రజలు ఎప్పుడూ ముందుండి ఆదరిస్తారని కొనియాడారు. అలాగే, చిత్ర పరిశ్రమ వర్గాలు, మీడియాకు ఆయన ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. "మనం ఇప్పటికీ ట్రేడ్‌లో 'సీడెడ్', 'నైజాం' అని పిలుస్తున్నాం. దయచేసి ఆ పదాలు వాడకండి. అవి బానిసత్వాన్ని, బూర్జువా వ్యవస్థను గుర్తుచేస్తాయి. వాటికి బదులుగా 'రాయలసీమ', 'తెలంగాణ' అనే అందమైన తెలుగు పదాలనే వాడుదాం" అని రాహుల్ సాంకృత్యన్ కోరారు. పీరియాడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# అతడితో మాట్లాడడం ఆపేశాక బరువు పెరిగాను

## : జాన్వీ కపూర్ సరదా వ్యాఖ్యలు

బాలీవుడ్ ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్' కొత్త సీజన్ ఆసక్తికరంగా సాగుతోంది. సల్మాన్ ఖాన్, విజయ్ దేవరకొండ, రష్మిక మందన తర్వాత ఇప్పుడు మూడో ఎపిసోడ్‌కు బాలీవుడ్ నటులు వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ ముఖ్య అతిథులుగా రాబోతున్నారు. శనివారం విడుదలైన ఈ ఎపిసోడ్ టీజర్, షోపై అంచనాలను పెంచుతోంది. ఇందులో వరుణ్, జాన్వీ ఇద్దరూ హోస్ట్ కరణ్ జోహార్‌పై చేసిన ఫన్నీ కామెంట్స్ హైలైట్‌గా నిలిచాయి. టీజర్ ప్రకారం, ఒకానొక సమయంలో కరణ్ జోహార్ తమ ఇద్దరితో మాట్లాడటం పూర్తిగా ఆపేశారని వరుణ్, జాన్వీ వెల్లడించారు. "మీ ఇద్దరి వల్ల నేను చాలా హర్ట్ అయ్యాను," అని కరణ్ చెప్పగా, జాన్వీ కపూర్ కలుగజేసుకొని, "మీరు మాతో మాట్లాడటం ఆపేశాక నేను బరువు కూడా పెరిగాను" అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి వరుణ్ ధావన్ స్పందిస్తూ, "కరణ్, మీరు చాలా డ్రామాటిక్‌గా ప్రవర్తించారు. అప్పుడు మీరు 'కభీ ఖుషీ కభీ గమ్'లోని బచ్చన్‌లా మారిపోయి 'నేను పెద్దవాడిని, అది నా హక్కు' అన్నట్టు వ్యవహరించారు" అంటూ కరణ్‌ను ఆటపట్టించారు. అయితే కరణ్ వారిపై ఎందుకు అలకబూనాడనే పూర్తి కారణం తెలియకపోయినా, ప్రస్తుతం వారి మధ్య అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఎపిసోడ్‌లో మరో స్పెషల్ అట్రాక్షన్‌గా రాపిడ్ ఫైర్ రౌండ్‌లో నటుడు అర్జున్ కపూర్ కూడా జాయిన్ అయ్యారు. కెరీర్, పెళ్లికి సంబంధించిన సలహాలు ఎవరి నుంచి తీసుకుంటావని కరణ్ అడగ్గా, వరుణ్ వెంటనే అర్జున్ కపూర్ పేరు చెప్పాడు.





# సరైన అవకాశం కోసం ఎదురుచూడొద్దు

## : నటి తమన్నా

సరైన అవకాశం కోసం ఎదురుచూడటం అనేది అతిపెద్ద అబద్ధమని ప్రముఖ నటి తమన్నా అన్నారు. విజయం సాధించాలంటే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలే కానీ... పరిపూర్ణమైన అవకాశం వస్తుందని ఎదురుచూస్తూ కూర్చోకూడదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రయాణం గురించి తమన్నా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

తాను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు గొప్ప నటిని కానీ, అద్భుతమైన డ్యాన్సర్‌ను కానీ కాదని తమన్నా గుర్తుచేసుకున్నారు. పరిశ్రమలోకి వచ్చాక అనుభవం ద్వారానే ప్రతి విషయాన్ని నేర్చుకున్నానని తెలిపారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకోవడానికి, దాన్ని ఆచరణలో పెట్టడమే ఉత్తమ మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు.

జీవితంలో మనం చేసే ప్రతి పని ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని, అది మన కెరీర్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడుతుందని వివరించారు. ఖాళీగా కూర్చొని మంచి అవకాశం కోసం ఎదురుచూసే బదులు, దొరికిన అవకాశాలను ఉపయోగించుకోవాలని, అదే నిజమైన విజయ రహస్యమని తమన్నా పేర్కొన్నారు. ప్రస్తుతం తమన్నా సినిమాలు, ఓటీటీ వెబ్ సిరీస్‌లతో కెరీర్‌లో చురుగ్గా కొనసాగుతున్నారు.

ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా

# కొత్త ప్రాజెక్ట్‌పై 'కాంతార' బ్యూటీ రుక్మిణి ఎమోషనల్ పోస్ట్!



కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ముఖ్యంగా 'కాంతార: చాప్టర్ 1'లో అవకాశం దక్కించుకున్న తర్వాత దక్షిణాది సినీ పరిశ్రమలో, ప్రత్యేకించి టాలీవుడ్‌లో ఆమెకు విపరీతమైన ఆదరణ పెరిగింది. ఈ క్రమంలోనే ఆమె తాజాగా ఒక కొత్త తెలుగు చిత్రానికి సంతకం చేసింది. 'ఒకే ఒక జీవితం' చిత్రంతో ఆకట్టుకున్న శ్రీ కార్తీక్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ, చిత్రబృందం ఒక చిన్న గ్లింప్స్‌ను కూడా విడుదల చేసింది. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రుక్మిణి వసంత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకుంది. "తొలిసారి కథ విన్నప్పటి నుంచే ఈ సినిమాపై మా బృందంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సెట్‌లోకి అడుగుపెట్టే ప్రతి క్షణం ఎంతో ఉత్కంఠగా అనిపించింది. ఈ సానుకూల వాతావరణం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. మొదటి రోజు నుంచే మాలో ఈ ఉత్సాహాన్ని నింపిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. ఇలాంటి మరిన్ని అద్భుతమైన అనుభవాలు ఎదురుకావాలని ఆశిస్తున్నాను" అని ఆమె పేర్కొంది. ఈ సందర్భంగా షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఆమె షేర్ చేసింది. ఈ చిత్రంలో రుక్మిణి 'తార' అనే కీలక పాత్రలో కనిపించనుంది. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుణి సినీ కార్పొరేషన్ బ్యానర్లపై మిసాయ్ కృష్ణ, దేవ్ రామ్‌నాథ్, శ్రీ కార్తీక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం.

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'.. ట్రైలర్ వచ్చేసింది!




విక్టరీ వెంకటేశ్ అభిమానులకు, సినీ ప్రియులకు చిత్రబృందం తీపి కబురు అందించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తోంది. 'ఏకే-47' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇవాళ హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ట్రైలర్ ను ఆవిష్కరించారు.ట్రైలర్ విడుదలను ప్రకటిస్తూ చిత్ర నిర్మాణ సంస్థ ఒక సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేశ్ ఎరుపు రంగు చొక్కా, స్టైలిష్ కళ్లద్దాలతో చిరునవ్వు చిందిస్తూ ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన తారాగణం కూడా ఈ పోస్టర్‌లో మెరిశారు. 'ట్రైలర్ అవుట్ నౌ' అనే క్యాప్షన్‌తో కూడిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

ఈ చిత్రం ఫ్యామిలీ ఎమోషన్స్, వినోదం, యాక్షన్ అంశాల కలయికగా రూపొందిందని చిత్ర బృందం పేర్కొంది. త్రివిక్రమ్ శైలి సంభాషణలు, వెంకటేశ్ మార్క్ కామెడీ టైమింగ్, కుటుంబ సెంటిమెంట్‌తో పాటు ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. వైవిధ్యభరితమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డు స్థాయి వ్యూస్‌తో దూసుకుపోతోంది. వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే వెంకటేశ్, తనదైన శైలిలో వెండితెరపై మ్యాజిక్ చేసే త్రివిక్రమ్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

# 60 అడుగుల నయనతార కటౌట్.. రెజీనా ఆసక్తికర ట్వీట్

లేడీ సూపర్ స్టార్ నయనతారపై ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ప్రశంసల వర్షం కురిపించారు. సాధారణంగా అగ్ర హీరోలకు మాత్రమే పరిమితమయ్యే భారీ కటౌట్లను నయనతార కోసం ఏర్పాటు చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఒక నటికి దక్కిన ఈ అరుదైన గౌరవం నిజంగా చారిత్రాత్మకమని ఆమె అభివర్ణించారు. వివరాల్లోకి వెళితే, తమిళనాడులో 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రం ప్రచారంలో భాగంగా నయనతారకు 60 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఎరుపు, బంగారు వర్ణ వస్త్రాలతో అమ్మవారి అలంకారంలో, చేతిలో త్రిశూలం ధరించిన నయనతార కటౌట్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కటౌట్ ఫొటోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న రెజీనా, నయనతారను ప్రత్యేకంగా అభినందించారు. "ఒక నటి కోసం ఇంత భారీ కటౌట్ ఏర్పాటు చేయడం బహుశా ఇదే తొలిసారి. నయనతార సంకల్ప బలానికి, విజయం పట్ల ఆమెకున్న అంకితభావానికి ఇది నిదర్శనం" అని రెజీనా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె నయనతారను ట్యాగ్ చేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు.

దక్షిణాది చిత్ర పరిశ్రమలో భారీ కటౌట్లు స్టార్‌డమ్‌కు నిలువుటద్దాలుగా నిలుస్తాయి. ఇప్పటివరకు కేవలం అగ్ర హీరోలకు మాత్రమే ఈ స్థాయిలో కటౌట్లు ఏర్పాటు చేసే సంప్రదాయం కొనసాగుతోంది. ఆ సంప్రదాయాన్ని అధిగమిస్తూ, ఒక నటి కోసం 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేయడం సినీ చరిత్రలో ఒక మైలురాయిగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad